APTEL /25/A2860

E వార్త NEWS

సీమ వార్త
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
వివరాలకు సంప్రదించండి
చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 160 | పేజీలు : 4 | బుధవారం 18 మార్చి 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 5/-

## పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

- దేశంలో నిరుద్యోగ సమస్యపై కీలక నివేదిక రిలీజ్
- పట్టభద్రులు చదువు పూర్తైన వెంటనే ఉద్యోగం పొందలేకపోతున్నారని వెల్లడి
- "గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది.



## జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి



- విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- అభిశంసనకు మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలని డిమాండ్
- రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు

**అమరావతి**

జగన్‌కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలని అన్నారు. విజయనగరం జిల్లా పర్యటించిన షర్మిల జామి గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు, నా అక్కచెల్లెమ్మల ఓట్లు ఎక్కడ పోయాయో అని బీద ఏడుపులు ఏడ్చారు కదా అని అన్నారు. అవసరమైనచోట దొంగ ఓట్లు, అవసరం లేనిచోట ఓట్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. - మిగతా3లో




## ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- పశ్చిమాసియా సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గం: భారత్
- ఈయూ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని చెప్పిన అధికార ప్రతినిధి
- దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎక్కడా కొరత లేదని కేంద్ర స్పష్టం

# పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం

- 'ఏపీ వన్' యాప్‌తో సత్వర సేవలు
- అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ వచ్చింది
- ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజల ఇళ్లకు చేర్చడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్ జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్ జీ) వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలి
- వారికి సంక్షిప్త సందేశాలు పంపాలి
- విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం రూపొందిస్తున్న 'ఏపీ వన్ యాప్'ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలి



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఊరటనిచ్చే వార్త చెప్పారు. రాష్ట్రానికి అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ అందుబాటులోకి వచ్చిందని, గ్యాస్ నిల్వలపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరా, పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ వంటి కీలక అంశాలపై ఆయన ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు ఉండగా, - మిగతా3లో

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్

- పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదు
- ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారు





## పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

- కాబుల్ దాడిని ఖండించిన భారత్
- మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శ
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్

## 'ఆ నిబంధన సరికాదు'

- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే ఎక్కువగా ఉంటే ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని సుప్రీం వ్యాఖ్య
- పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

2



## వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్



- జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడనే చర్చ జరుగుతోంది: జగన్
- విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులు
- అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది
- రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు

**అమరావతి**

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వంపై తన విమర్శనాస్త్రాలకు మరింత పదును పెట్టారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు. తమ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి - మిగతా3లో



## 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా

- భవానీపుర్ బరిలో మమత–సువేందుతో మళ్లీ ఢీ
- ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దు
- జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోంది
- అభ్యర్థుల జాబితా విడుదల వేళ సీఎం మమత వ్యాఖ్యలు

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

- పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి
- మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏపీఈడీబీ నూతన కార్యాలయం ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకి వచ్చాయని వెల్లడి
- గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది
- దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి




**అమరావతి**

దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయలు ఏపీకే వచ్చాయని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ నెల 23వ తేదీన రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. ఇంతటితో తృప్తి పడకుండా ఎందుకు 5 స్టీల్ సిటీలు నిర్మించకూడదనే లక్ష్యంతో పని చేయాలని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండాగా - మిగతా3లో

# 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపుర్ సీటును ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు.

**"ఈసీ పావులు కదిపినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయింది"**

బీజేపీ పాలనా వైఫల్యం వల్లే భారతదేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ సంక్షోభం ఏర్పడిందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దని బీజేపీకి ఆమె సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బంగాల్‌లో చాలా తెలివిగా పావులు కదిపిందని, అయినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయిందని మమత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయన్నారు. ఇది బంగాల్ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నిక అని, ఇందులో దిల్లీ లడ్డూ గెలవదని, బంగాలే గెలుస్తుందని దీదీ విశ్వాసం వెలిబుచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ఆమె తెలిపారు.

**"ఏదైనా జరిగితే, నిందలు నాపై మోపొద్దు"**

"నా సర్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. ఒకవేళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వస్తే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? ఒకవేళ శాంతిభద్రతల సమస్య తలెత్తితే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? నా ప్రభుత్వంలోని అధికారులంతా బంగాలీలే, చివరకు వాళ్లను కూడా తొలగించారు. ఇక వినీత్ కుమార్, మురళీధర్ లాంటి బంగాలీయేతర అధికారులను సైతం లాక్కున్నారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించారు. వాళ్ల బాధ్యతను ఎవరు తీసుకుంటారు? బయటి వాళ్లు బంగాల్‌లో ఉన్నారు. వాళ్ల దగ్గర డబ్బులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ ఏదైన జరిగితే, నిందలు నాపై మోపొద్దు" అని సీఎం మమత వ్యాఖ్యానించారు.

**"బీజేపీ పథకం ప్రకారమే, ఆయుధాలతో వచ్చింది""**

"ప్రధాని మోదీకి నేను చెప్పేది ఒక్కటే విషయం. 2026 ఎన్నికల్లో టీఎంసీ గెలవబోతోంది. గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను టీఎంసీ సాధించబోతోంది. ప్రజలారా బీజేపీని బహిష్కరించండి. ఆ పార్టీకి ఓట్లు వేయొద్దు. ఈ ఎన్నికల్లో టీఎంసీకి 226కుపైగా అసెంబ్లీ సీట్లు వస్తాయి. నగదు ప్రోత్సాహకాల కంటే ప్రాంతీయ ఐక్యతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ప్రజలు డబ్బుకు ఓటు వేయకూడదు. బంగాల్ అస్తిత్వానికి ఓటు వేయాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ ప్రజలే గెలుస్తారు. బీజేపీ పక్కా పథకం ప్రకారమే, ఇక్కడికి ఆయుధాలతో వచ్చింది" అని సీఎం మమత ఆరోపించారు.

**కీలక టీఎంసీ అభ్యర్థులు**

బంగాల్ రాష్ట్ర మంత్రులు చంద్రిమా భట్టాచార్యకు దుమ్ దుమ్ ఉత్తర్, ఫర్హాద్ హాకిమ్‌కు కోల్‌కతా పోర్ట్ అసెంబ్లీ స్థానాలను టీఎంసీ కేటాయించింది.

ఎమ్మెల్యే మదన్ మిత్రాకు కమర్హాతీ, కునాల్ ఘోష్‌కు బెలెఘాటా, డాక్టర్ శశి పాంజాకు శ్యామ్‌పుకుర్ సీట్లను టీఎంసీ ఇచ్చింది.

రాష్ట్ర మాజీ విద్యామంత్రి పార్థ్ ఛటర్జీ బెహలా పశ్చిమ్ సీటును ఆశించారు. కానీ ఆయన స్థానంలో రత్న ఛటర్జీకి ఆ సీటును కేటాయించారు.

# పనిచేసే సామర్థ్యం ఉన్నా దేశంలో 40% పట్టభద్రులకు ఉద్యోగాలు లేవు

దేశంలో నిరుద్యోగంపై కీలక నివేదిక వెలువడింది. భారత్‌లో 20–29 ఏళ్ల మధ్య వయసున్న 63 మిలియన్ల మంది పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు తేలింది. ఈ పట్టభద్రుల్లో ఏడు శాతం మందే గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' పేరిట తాజాగా నివేదిక విడుదల చేసింది.

**'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక ప్రకారం**

పట్టభద్రుల్లో నిరుద్యోగం అధికంగానే ఉంది. 15–25 ఏళ్ల మధ్య వయసు వారిలో దాదాపు 40 శాతం, 25– 29 ఏళ్ల మధ్య వయసు వారిలో 20 శాతంగా నిరుద్యోగం ఉంది. తమ గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాదిలోపు అతి కొద్ది మంది మాత్రమే స్థిరమైన జీతంతో కూడిన ఉద్యోగాలు పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో పట్టభద్రుల జనాభా పెరగడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైంది.

**'పట్టభద్రుల సంఖ్య పెరిగింది'**

"గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో యువ జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే ఉన్నత విద్యనభ్యసించేవారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో యువ పట్టభద్రుల సంఖ్యలో కూడా పెరుగుదల కనిపించింది. 2023 నాటికి 20– 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 63 మిలియన్ల పట్టభద్రుల్లో 11 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యా అంతరాలను పూడ్చడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ఉన్నత విద్యలో మొత్తం నమోదు నిష్పత్తులు దేశ అభివృద్ధి స్థాయికి అనుగుణంగా ఉన్నాయి. లింగ, కుల ప్రాతిపదికన విద్యను పొందడంలో ఉన్న సామాజిక, ఆర్థిక అడ్డంకులు తగ్గాయి. దాని ఫలితంగా భారత్‌లో కార్మిక మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న శ్రామిక శక్తి



మరింత సమర్థవంతంగా ఉంది" అని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదికలో పేర్కొంది.

యువ పట్టభద్రుల్లో నిరుద్యోగం రేటు అధికంగా ఉందని నివేదికలో తేలింది. ఉన్నత విద్య చదివే యువకుల సంఖ్య 2017లో 38 శాతం ఉండగా, అది 2024 చివరి నాటికి 34 శాతానికి పడిపోయిందని వెల్లడించింది. వీరిలో అధిక శాతం మంది తమ కుటుంబ పోషణ కోసం చదువును మానేస్తున్నారని స్పష్టం చేసింది. "చాలా మంది యువకులు చదువు మానేయడానికి చెప్పే అత్యంత సాధారణ కారణం కుటుంబాన్ని పోషించడం కోసమే. 2017లో ఈ కారణాన్ని పేర్కొన్న వారి వాటా 58 శాతంగా ఉంది. 2023 నాటికి ఇది 72 శాతానికి పెరిగింది" అని నివేదికలో వెల్లడైంది. 2004-2025 నుంచి 2023 వరకు ఏటా సుమారు 50 లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్నారని నివేదిక పేర్కొంది. వారిలో కేవలం 28 లక్షల మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని వెల్లడించింది. వీరిలో ఇంకా చాలా తక్కువ మంది మాత్రమే మంచి జీత భత్యాలు పొందే ఉద్యోగాలను సంపాదిస్తున్నారని స్పష్టం చేసింది. ఇది పట్టభద్రులలో పెరుగుతున్న నిరుద్యోగానికి, ఆదాయ వృద్ధి మందగించడానికి దోహదపడిందని తెలిపింది. "ఉద్యోగం పొందే సమయంలో నాన్ గ్రాడ్యుయేట్స్‌తో పోలిస్తే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారి జీతాలు ఎక్కువగా ఉంటాయి. నాన్ గ్రాడ్యుయేట్స్‌తో పోలిస్తే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారి శాలరీ రెట్టింపు ఉండొచ్చు. ఉద్యోగ అనుభవం పెరుగుతున్న కొద్దీ ఈ శాలరీ వ్యత్యాసం మరింత పెరుగుతుంది. అయితే, యువ పట్టభద్రులు ఉద్యోగ ప్రారంభంలో తక్కువ జీతాన్ని పొందుతున్నారు" అని 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక పేర్కొంది.

# పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి

అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పుని పేర్కొంది.

అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్గాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. ఆఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్? తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో



ఆఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్? సంఘీభావంగా నిలుస్తుంది. ఆఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మా పూర్తి మద్దతును ఇస్తున్నాం."

**ఐక్యరాజ్య సమితి వేదికపై పాక్‌కు భారత్ కౌంటర్?**

పవిత్ర రంజాన్ మాసంలో అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై భారత్? తీవ్రంగా ఖండించింది. అలాగే అఫ్గాన్ జాతీయులను తరలించడంపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని పాక్ తీరును ఎండగట్టారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఇస్లామోఫోబియాను ఎదుర్కొనే అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు.

"భారత్ పొరుగు దేశం వారి ప్రాంతంలో ఇస్లామోఫోబియాపై కల్పిత కథలను అల్లడంలో ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. ఈ దేశంలో అహ్మదీయులపై జరుగుతున్న క్రూరమైన అణచివేతను, నిస్సహాయులైన ఆఫ్గాన్‌లను పెద్ద ఎత్తున వెనక్కి పంపడాన్ని, పవిత్ర రంజాన్ మాసంలో వైమానిక దాడుల చేయడాన్ని ఏమని పిలుస్తారో అని ఆశ్చర్యం కలుగుతోంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు మత గుర్తింపును ఒక ఆయుధంగా మార్చడం, ఇంకా దానిని తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, దాని వల్ల కలిగే ప్రమాదాలను ఐక్యరాజ్యసమితి గమనించడం చాలా ముఖ్యం" అని ఐక్యరాజ్యసమితిలో శాశ్వత ప్రతినిధి హరీశ్? పర్వతనేని అన్నారు.

అంతకుముందు అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో సుమారు 400 మంది మృతిచెందగా 250 మందికి పైగా గాయాలైనట్లు అఫ్గాన్ ప్రభుత్వం వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఈ దాడిలో ఆసుపత్రి భవనం పెద్ద భాగం పూర్తిగా ధ్వంసమైందని అక్కడి అధికారవర్గాలు తెలిపాయి. భవన శిథిలాల్లో పలువురు చిక్కుకుని ఉన్నారని అధికారులు వెల్లడించారు. సుమారు 2వేల పడకలు గల ఈ ఆసుపత్రిలో మాదకద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్నారు. దాడి సమయంలో అక్కడ వందల సంఖ్యలో రోగులు ఉండటం వల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అధికారులు తెలిపారు. అయితే, పాకిస్థాన్ మాత్రం అఫ్గాన్ పౌరులపై తాము ఎలాంటి దాడులు చేయలేదని పేర్కొంది. ఆస్పత్రులను తాము లక్ష్యంగా చేసుకోలేదంటూ ఆరోపణలను ఖండించింది. కాబూల్‌తో పాటు తూర్పు ఆఫ్గానిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఆయుధ నిల్వ కేంద్రాలపైనే లక్ష్యంగా దాడులు జరిపామని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది.

## 'ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు'

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్? నేతల ఆహ్వానం మేరకు బ్రస్సెల్‌లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రస్సెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్–ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్?తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. అటు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో పర్యటించారు. బ్రస్సెల్స్‌లో పర్యటనను విజయవంతంగా ముగించానంటూ ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల మండలి సమావేశం, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో భేటీ, ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో చర్చలు జరిగాయి. ఈయూ ప్రతినిధులను కూడా కలుసుకుని పలువురితో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపాము." అని పోస్ట్ చేశారు. ఈ క్రమంలోనే ఈయూ– భారత్? స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద సహా పది కీలక అంశాలపై చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో ఇంధన కొరత ఏర్పడవచ్చనే వార్తల నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి అధికంగా కొనుగోలు చేయడం వంటివి చేయవద్దని ఆమె కోరారు. సహజ వాయువు సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని సుజాత శర్మ తెలిపారు. వాణిజ్యపరమైన ్గా+ సిలిండర్లను వాడుతున్న వినియోగదారులు ్గాచీ+ కనెక్షన్‌లకు మారడం శ్రేయస్కరమని, దీనివల్ల నిరంతరాయంగా గ్యాస్ సరఫరా పొందవచ్చని సూచించారు. గృహ వినియోగదారులకు ్గా+ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, గత కొద్ది రోజులుగా దేశీయ గ్యాస్ ఉత్పత్తిని కూడా పెంచామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 15వేల సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. "గ్యాస్ సిలిండర్లకు సంబంధించి గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా సుమారు 12,000 దాడులు జరిగాయి. దాదాపు 15,000 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిన్న దిల్లీలో సుమారు 600 సిలిండర్లను సీజ్ చేశారు. గత కొన్ని రోజుల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో దాదాపు 450 తనిఖీలు జరిగాయి. ఇందులో 10 మందిని అరెస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌లో 564 దాడులు నిర్వహించి, పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు అరెస్టు చేశారు. కేరళలో సుమారు 1,000 దాడులు నిర్వహించి, గృహ, వాణిజ్య అవసరాలకు వాడుతున్న అక్రమ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు." అని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు.

## 'ఆ నిబంధన సరికాదు'

చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నండూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్?పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది.

అయితే, 1961 నాటి మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఇంకా ఈ చట్టం ప్రకారం అర్హులైన మహిళలకు 26 వారాలు వేతనంతో కూడిన సెలవుకు హక్కు కల్పిస్తుంది. ఇది ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాలకు వర్తిస్తుంది. పితృత్వ సెలవుపై ప్రైవేట్ రంగానికి సంబంధించి ఎలాంటి చట్టం లేకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల వేతనంతో కూడిన పితృత్వ సెలవుకు అర్హత ఉంది. ఒకవేళ ప్రైవేట్ రంగ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని పొందడానికి సరైన నిబంధనలు లేవు.

**రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**

అంతకుముందు రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తూ జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని తీసుకురావాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని తిరస్కరించింది. చట్టబద్ధంగా దీన్ని తప్పనిసరి చేస్తే మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని, ఈ చర్య మహిళల పట్ల లింగ వివక్షకు దారితీసే ప్రమాదం ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. శైలేంద్ర మణి త్రిపాఠీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రుతుక్రమం అనేది మహిళలకు జరుగుతున్న చెడుగా, భయాన్ని సృష్టించేలా, వారిని తక్కువ చేసి చూపేలా ఈ తరహా పిటిషన్లు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేరళలోని పాఠశాలలతో పాటు పలు ప్రైవేట్ కంపెనీలు ఇప్పటికే స్వచ్ఛందంగా మహిళలకు రుతుక్రమ సెలవులు ఇస్తున్న విషయాన్ని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ, సంస్థలు స్వచ్ఛందంగా ఈ సెలవులు ఇస్తే అది అద్భుతమైన విషయమని అన్నారు. కానీ, చట్టప్రకారం దీన్ని తప్పనిసరి చేసిన మరుక్షణం మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, న్యాయవ్యవస్థల్లోనూ వారిని తీసుకోరని, దాంతో వారి కెరీర్ ముగుస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళల వృత్తిపరమైన ఎదుగుదలపై ఇలాంటి నిబంధనలు ప్రతికూల ప్రభావం చూపుతాయని సుప్రీంకోర్టు పేర్కొంది.

## రైల్వే శాఖపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఫైర్


రైల్వే ఉద్యోగుల ప్రమోషన్ పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేయడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైల్వే శాఖపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పరీక్షలను కన్నడ భాషలో రాసేందుకు అవకాశం కల్పించకపోవడంతో కన్నడ సంఘాలు నిరసన చేపట్టాయి. దీంతో రైల్వే శాఖ హఠాత్తుగా పరీక్షలను రద్దు చేసింది. ఈ చర్యను సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో, నైరుతి రైల్వే పరిధిలో 194 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు, హుబ్బళ్లి డివిజన్‌లో 101 ఎల్‌డీసీఈ పోస్టుల ప్రమోషన్ల కోసం జరగాల్సిన పరీక్షలను చివరి నిమిషంలో రద్దు చేశారని తెలిపారు. ఈ ఆకస్మిక నిర్ణయంతో కన్నడ ఉద్యోగులు తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను కన్నడలో నిర్వహించాలని వేలాది మంది ఉద్యోగులు, పలు సంస్థలు శాంతియుతంగా విజ్ఞప్తి చేసినప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. నిరసనలు ఉధృతమయ్యాక హడావుడిగా పరీక్షను రద్దు చేయడం ఖండనీయమని పేర్కొన్నారు. "మొదట్లోనే ఈ సమస్యను గుర్తించి, కన్నడలో పరీక్షకు అనుమతి ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రైల్వే శాఖ కన్నడ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది," అని ఆయన విమర్శించారు. కర్ణాటకకు చెందిన వి. సోమన్న రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని సిద్ధరామయ్య అన్నారు.

# పెట్రోల్, డీజిల్, ఎరువులపై యుద్ధ ప్రభావం

యుద్ధాల్లో స్పష్టమైన విజేతలు ఉండటం చాలా అరుదు. సామాన్య ప్రజలే తరచూ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ ఇంధన మార్కెట్లు, సరఫరా గొలుసులు అస్తవ్యస్థంగా మారడంతో, కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక పర్యవసనాలను ఎదుర్కోవాల్సి వస్తోంది.అయితే ఇంతటి అనిశ్చితిలోనూ కొన్ని దేశాలు సరికొత్త వ్యూహాత్మక అవకాశాల కోసం చూస్తున్నాయి.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆ ప్రాంతంలో ప్రతికూల పరిణామాలను కలిగిస్తోంది.గల్ఫ్ దేశాలను అస్థిరపరిచింది. మధ్య ప్రాచ్యంలోని వేలాది మంది ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఇళ్లను విడిచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.చమురు ధరల పెరుగుదల, గల్ఫ్‌లో హోర్ముజ్ జలసంధి వద్ద సముద్ర రవాణాకు కలుగుతున్న అంతరాయం వ్యాపారులకు, వినియోగదారులకు మరింత ఖర్చును పెంచుతోంది.ఇరాన్ రష్యాకు కీలకమైన మిత్రదేశం. అత్యంత ముఖ్యమైన సైనిక భాగస్వామి. సిరియాలో బషర్ అల్–అసద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం, వెనెజ్వెలాలో నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత.. మాస్కోకు దౌత్యపరంగా ఎదురైన మరో ఎదురుదెబ్బ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం.అయితే, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం యుక్రెయిన్‌తో రష్యా తలపడుతోన్న యుద్ధానికి ప్రయోజనకరంగా మారవచ్చు. ఎందుకంటే, అమెరికా తన సైనిక బలగాలను మధ్య ప్రాచ్య సంక్షోభం వైపు మళ్లించవచ్చు." పేట్రియాట్ క్షిపణులు, ఇంటర్‌సెప్టార్లు తగ్గిపోవడం రష్యాకు ప్రయోజనకరంగా మారుతుంది. దీనివల్ల యుక్రెయిన్‌కు అందే ఆయుధాల సంఖ్య తగ్గిపోతుంది" అని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు చెందిన పారిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ నికోల్ గ్రాజేవ్‌స్కీ పర్షియన్‌కు చెప్పారు.తెహ్రాన్‌కు షాహెద్ డ్రోన్ల అవసరం పెరిగినందువల్ల యుక్రెయిన్‌లో మాస్కో సామర్థ్యాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు."యుక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పుడు ఒక నిర్దిష్ట కాలం పాటు రక్షణ సహకారాల్లో భాగంగా రష్యా ఇరాన్‌పై ఆధారపడింది. అప్పుడు ఇరాన్ షాహెద్ డ్రోన్లను అందించింది. ముఖ్యంగా 2022–23ల్లో వీటి ప్రొడక్షన్ టెక్నాలజీని, ఈ డ్రోన్ల లైసెన్స్‌లను రష్యాకు అందించింది" అని అమెరికాలోని సెంటర్ ఫర్ నాన్–ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన యురేసియా డైరెక్టర్ హన్నా నోట్ తెలిపారు.'ఇప్పుడు యుక్రెయిన్‌లో యుద్ధం కొనసాగించడానికి రష్యాకు ఇరాన్ మద్దతు అవసరం లేని దశలో ఉంది. రష్యా సొంతంగా షాహెద్ డ్రోన్లను ఉత్పత్తి చేసుకోగలదు" అని తెలిపారు.ఇదే సమయంలో చమురు, గ్యాస్ సరఫరాలకు అత్యంత కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఇది యుక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడికి గురైన రష్యాకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.రష్యా బడ్జెట్ ఎక్కువగా ఆ దేశ చమురు ఎగుమతులపైనే ఆధారపడింది. అప్పట్లో బ్యారల్ చమురు ధర 59 డాలర్లు ఉండేది. ప్రస్తుతం ముడి చమురు ధర గణనీయంగా పెరిగింది. ఒకానొక సమయంలో బ్యారల్ సుమారు 120 డాలర్లకు ఎగిసింది.గల్ఫ్‌లోని ప్రముఖ చమురు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించడంతో.. ప్రస్తుతం చైనా, భారత్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు రష్యా మరింత ఎక్కువగా ఎగుమతి చేసే అవకాశం ఉంది."గతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా అమెరికా భారత్‌ను అడ్డుకుంది. కానీ, ప్రస్తుతం సంక్షోభంతో భారత్‌కు కాస్త ఉపశమనాన్ని కల్పిస్తూ.. మళ్లీ రష్యా చమురు కొనుగోలుకు అనుమతిచ్చింది. కనీసం వచ్చే నెల వరకు ఈ కొనుగోళ్లు కొనసాగవచ్చు ' అని గ్లోబల్ ఎనర్జీ, కమోడిటీ మార్కెట్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆర్గస్ చీఫ్ ఎకనామిస్ట్ డేవిడ్ ఫైఫె చెప్పారు.ఈ సమస్యల నుంచి కొంత బయటపడేందుకు రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ యుద్ధం వల్ల చైనాపై పడే ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా చూడాల్సి ఉంది.చైనా ముడిచమురు దిగుమతుల్లో కేవలం 12 శాతం మాత్రమే ఇరాన్ నుంచి వస్తుందని సెంటర్ ఆన్ గ్లోబల్ ఎనర్జీ పాలసీ తెలిపింది.పైగా, చైనాలో కొన్ని నెలలకు సరిపడా చమురు సరఫరాలున్నాయి. ఆ తర్వాత తేలికగా రష్యా సాయాన్ని కూడా చైనా కోరుతుండొచ్చు.అయితే యుద్ధం వల్ల, చైనా "ఎగుమతుల ఆధారిత పరిశ్రమల రంగం" ప్రభావితం చెందవచ్చని ఫైఫె తెలిపారు.ప్రాపర్టీ ధరలు పడిపోవడం, దేశీయ వ్యయం తగ్గిపోవడంతో సతమతమవుతున్న చైనా ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా పనిచేసేది, ఆ దేశ జీడీపీలో 20శాతం వాటా ఉన్న ఎగుమతులే.హోర్ముజ్ జలసంధిలో సముద్ర రవాణాకు నెలకొన్న అంతరాయం చైనాకు అంత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ, చైనా ఉత్పత్తులు పశ్చిమానికి వెళ్లేందుకు అట్లాంటిక్ చేరుకోవడం క్లిష్టంగా మారవచ్చు.మరోవైపు, ఆసియా, యూరప్, ఆఫ్రికాలను కలిపే అరేబియన్ ద్వీపకల్పంలోని బాబ్ ఎల్–మాండెబ్ జలసంధిలో కూడా ఇరాన్ అండదండలున్న హౌతీలు దాడులు చేస్తున్నారు." ఇరాన్‌పై యుద్ధంలో చైనాకు దౌత్య అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అమెరికాకు సమతూకంగా తనను తాను నిలబెట్టుకునేందుకు ఇది ప్రయత్నిస్తుంది" అని యూకే రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిలిప్ షెట్లర్ జోన్స్ చెప్పారు.మధ్య ప్రాచ్యంలోని చమురు, గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడ్డ ఆగ్నేయాసియా దేశాలు ఈ యుద్ధంతో ఎక్కువగా ప్రభావితమవుతాయి.కొన్ని ఇప్పటికే కఠినమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. వీలైనంత త్వరగా ఆర్థిక ప్రభావాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నాయి. వియత్నాంలో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి డీజిల్ ధర 60 శాతం పెరిగింది. వీలైతే ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది.మధ్య ప్రాచ్యం నుంచి ముడిచమురు దిగుమతులపైనే 95 శాతం ఆధారపడ్డ ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ సేవల్లో పనిచేసే వారు మినహాయించి ప్రభుత్వ రంగ ఉద్యోగులు ప్రస్తుతం వారానికి నాలుగు రోజులే పనిచేస్తున్నారు.పాకిస్తాన్‌లో కూడా ఇదే రకమైన ఆంక్షలను ప్రవేశపెట్టారు. వీలైనప్పుడల్లా వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలను జారీ చేస్తున్నారు. యూనివర్సిటీ తరగతులన్నీ ఆన్‌లైన్‌లోకి మారాయి.యుద్ధభయంతో భారీ కొనుగోళ్ల కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దీంతో, కార్లకు రోజుకు 10 లీటర్లు, మోటార్‌సైకిళ్లకు కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇచ్చేలా పలు నిర్ణయాలను ప్రకటించింది.కానీ, యుద్ధం పర్యవసనాలు ఇంధన కొరతలకు మించి ఉండనున్నాయి.ప్రపంచవ్యాప్తంగా రైతులు తమ పంటల కోసం ఎరువులపై ఆధారపడ్డారు. ఈ ఎరువుల రవాణాలో అంతరాయాలు ఏర్పడితే, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు ప్రమాదం వాటిల్లనుంది." ప్రపంచ యూరియాలో 30 శాతం హోర్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంది. పెట్రో కెమికల్స్ నుంచి యూరియా వస్తుంది. ముడి చమురును శుద్ధి చేయడం ద్వారా పెట్రోకెమికల్స్ తయారవుతుంది. ప్రపంచ మార్కెట్ల నుంచి 30 శాతం యూరియాను తీసివేస్తే, ప్రపంచ ఆహార భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపనుంది" థింక్ ట్యాంక్ చాథమ్ హౌస్ మిడిల్ ఈస్ట్ నిపుణులు నీల్ క్విలియం తెలిపారు.ప్రపంచంలో అతిపెద్ద గ్యాస్ ఎగుమతిదారుల్లో ఒకటైన, ఎరువుల కోసం యూరియాను ఉత్పత్తి చేసే ప్రధాన సంస్థల్లో ఒకటి ఖతార్ ఇంధన స్థావరాలపై దాడులు జరిగాయి. ఈ దాడులతో కంపెనీలు తమ ఉత్పత్తి, డెలివరీలను తాత్కాలికంగా నిలిపివేసేలా అత్యవసర చర్యలను ప్రకటించాల్సి వచ్చింది."ఆహార భద్రత , ద్రవ్యోల్బణంపై ప్రభావాన్ని మీరు చూడొచ్చు" అని క్విలియం తెలిపారు."ఈ ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా లెక్కించలేదు. కానీ, పంటలకు ఇబ్బందులు ఎదురైతే, ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడితే మనం దీర్ఘకాలిక ప్రభావాన్ని చూడాల్సి రావచ్చు" అన్నారు.

# ఏపీలో ఇక ఆఫీసర్ల హవా

**విజయవాడ :** ఏపీలో ఇక ఆఫీసర్ల హవా.. లీడర్ల దారెటు? నగరాలు, పట్టణాల్లో రాజకీయం కొత్త టర్న్ తీసుకుంటుందా? రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు. పాలక వర్గాల గడువు ముగుస్తుంది. అధికారుల పాలన రానుంది. ఏపీలోని 86 నగర పంచాయతీలు, 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది ప్రభుత్వం. కొత్తగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎన్నికై..పాలకవర్గాలు కొలువుదీరే వరకు మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్లు పాలనలో కొనసాగనుంది. దాదాపు 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లిపోనున్నాయి. కార్పొరేషన్లకు ఐఏఎస్ స్థాయి ఆఫీసర్లను, మున్సిపాలిటీలకు ఆర్డీవో క్యాడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది సర్కార్. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం కార్పొరేషన్లకు ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహంచనున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగి మేయర్లు బాధ్యతలు స్వీకరించే వరకు వీరి ఆధ్వర్యంలో ఆయా నగరాల్లో పాలన వ్యవహారాలు కొనసాగనున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో లీడర్లు కుర్చీలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు 90 శాతం మున్సిపాలిటీలు వైసీపీ నేతల చేతుల్లోనే ఉన్నాయి. ఆ పార్టీకి




చెందిన నేతలే మున్సిపల్ ఛైర్మన్లుగా, మేయర్లుగా కొనసాగుతున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క తాడిపత్రి మినహా రాష్ట్రంలో మిగిలిన అన్నిచోట్ల వైసీపీనే పాగా వేసింది.అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొన్ని చోట్ల రాజకీయ పరిస్థితులు మారడం, కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించడంతో..పది పదిహేను మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటికీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ నేతలే ఛైర్మన్లు, మేయర్లుగా ఉన్నారు. పదవీ కాలం పూర్తి కావడంతో వాళ్లంతా మాజీలు అవుతున్నారు. దీంతో నగరాలు, పట్టణాల్లో పొలిటికల్ ఈక్వేషన్స్ మారుతున్నట్లు కనిపిస్తోంది.జూన్‌లోపు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచనలో కూటమి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అప్పుడే పట్టణాల్లో రాజకీయ వేడి వేడెక్కుతోంది. ఇప్పటికే కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పని చేస్తున్న వాళ్లు బరిలోకి దిగేందుకు సిద్ధపడుతుండగా..కొత్తగా మరికొందరు లీడర్లు ఎన్నికల రంగంలోకి దిగేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు.కార్పొరేషన్లలో అయితే పొలిటికల్ హీట్ నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటుంది. పలు చోట్ల ఇప్పటికే మేయర్ కుర్చీలు టీడీపీ ఖాతాలో ఉండగా..కడప లాంటి చోట వైసీపీ పట్టు కొనసాగిస్తోంది. దీంతో గతంలో వైసీపీ గెలిచినట్లు వార్ వన్ సైడే అన్నట్లుగా మున్సిపల్ ఎన్నికల్లో పాగా వేయాలని ప్లాన్ చేస్తోందట కూటమి. ఇదే అదునుగా పార్టీ మారాలనుకుంటున్న పలువురు లీడర్లు కూడా పావులు కదుపుతున్నట్లు ఇన్ సైడ్ టాక్. పురపోరు నాటికి లీడర్ల జంపింగ్‌లు, పొలిటికల్ ఈక్వేషన్లు ఎలా మారుతాయో? తాజా మాజీలు మళ్లీ ఎన్నికల బరిలో నిలుస్తారో లేదో? ఒకవేళ పోటీ చేసినా ఏ పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారోనని లోకల్ పాలిటిక్స్ అప్పుడే వేడెక్కుతున్నాయి

# హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

**అమరావతి :** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం వేగం పుంజుకుంది. అమరావతి నిర్మాణంలో భాగంగా జీఏడీ, హెచ్‌ఓడీ టవర్లు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. జీఏడీ టవర్ 47 అంతస్థులతో, మిగతా నాలుగు హెచ్‌ఓడీ టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నారు. డయాగ్రిడ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే టవర్ -1కు సంబంధించి మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మంత్రి నారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. 2028 అక్టోబర్ నాటికల్లో టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులలో వేగం పెరిగింది. సోమవారం రోజున అమరావతిలోని హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు ప్రారంభమయ్యాయి. ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం విలేకర్లతో మాట్లాడిన మంత్రి నారాయణ .. అమరావతి రైతులకు చెప్పిన మాట



ప్రకారమే రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమరావతి జీఏడీ, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా డయాగ్రిడ్ టెక్నాలజీతో మొత్తం ఐదు టవర్లు నిర్మిస్తున్నట్లు నారాయణ వెల్లడించారు.47 అంతస్తులలో జీఏడీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. మిగతా టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 53 లక్షల చదరపు అడుగుల బిల్ట్ ఏరియాతో టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అన్ని కార్యాలయాలు, అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్లను డిజైన్ చేసినట్లు తెలిపారు. 2028 అక్టోబర్ నాటికి జీఏడీ, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.మరోవైపు మూడు ప్యాకేజీల కింద అమరావతిలో టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. రూ.4,688.82 కోట్ల అంచనా వ్యయంతో వీటి నిర్మాణం చేపట్టారు. మొదటి ప్యాకేజీ కింద రూ.1,126.51 కోట్లతో జీఏడీ టవర్ నిర్మిస్తున్నారు. రెండో ప్యాకేజీ పనుల కింద 1,897.86 కోట్ల రూపాయలతో 1, 2 టవర్లు నిర్మించనున్నారు. మూడో ప్యాకేజీ పనుల కింద రూ.1,664.45 కోట్లతో మూడు, నాలుగో టవర్లు నిర్మించనున్నారు. ఈ ఐకానిక్ టవర్ల నిర్మాణం డయాగ్రిడ్ విధానంలో చేపట్టనున్నారు.టవర్లలో జీఏడీ టవర్ అన్నింటికంటే ఎత్తు ఉండనుంది. బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా జీఏడీ టవర్‌ను 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే సీఎం ఆఫీస్ ఉంటుంది. జీఏడీ టవర్ టెర్రస్‌పై హెలిప్యాడ్ నిర్మించనున్నారు. మిగతా నాలుగు హెచ్‌ఓడీ టవర్లను 40 అంతస్తుల చొప్పున నిర్మించనున్నారు. ఇక ఈ డిజైన్ 60 వేల టన్నుల స్టీల్ అవసరమవుతుందని అంచనా.

## పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

తాజాగా విశాఖలో అదనపు స్టాక్ చేరడంతో సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎం భరోసా ఇచ్చారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయాన్ని ప్రస్తుతం ఉన్న దానికంటే తగ్గించి, కేవలం 1.5 రోజుల్లో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు గ్యాస్ కొరత రాకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టవ్‌ల లభ్యతను కూడా పరిశీలించాలని సూచించారు.

**పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తరణే లక్ష్యం**

ఎల్పీజీ సరఫరాను పర్యవేక్షిస్తూనే, దీనికి శాశ్వత ప్రత్యామ్నాయంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్వర్క్‌ను మరింతగా విస్తరించడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజల ఇళ్లకు చేర్చడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్ జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్ జీ) వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్జీని ఏపీకి కేటాయించుకుని, రెండు సీజన్లలో పైప్ లైన్ ద్వారా కొండపల్లి వరకు తీసుకురాగలిగామని సీఎం గుర్తు చేశారు. తక్కువ వ్యయంతో కూడిన ఇంధనాన్ని వినియోగదారులకు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ వంటి సంస్థలు 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తున్నాయని, 1.68 లక్షల గృహాలకు కనెక్షన్లు ఇచ్చే మౌలిక సదుపాయాలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, అమరావతితో పాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్‌ను భారీగా విస్తరించేందుకు వెంటనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించేలా పెట్రోలియం కంపెనీలతో మాట్లాడి, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

**'ఏపీ వన్' యాప్‌తో సత్వర సేవలు**

ఈ సమీక్షలో కేవలం ఇంధన అంశాలకే పరిమితం కాకుండా, పలు పాలనాపరమైన అంశాలపైనా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని, వారికి సంక్షిప్త సందేశాలు పంపాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం రూపొందిస్తున్న 'ఏపీ వన్ యాప్'ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ శాఖలు 'డేటా లేక్', 'అవేర్' వేదికలను ఏ మేరకు వినియోగించుకుంటున్నాయో గుర్తించి, వేసవిలో తాగునీరు, వడగాల్పులు, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు, గెయిల్, ఓఎన్జీసీ, వివిధ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్

-మొదటిపేజీ తరువాయి

చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## జగన్‌కు ధైర్యం ఉంటే సీఈసీపై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తోందని షర్మిల అన్నారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలని షర్మిల అన్నారు. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారని ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోందని షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ బీద ఏడుపులు ఏడ్చారు. జగన్ కు ధైర్యం ఉంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిపై పార్లమెంటులో పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలి. అలానే మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్సీపీ ఎంపీలు సంతకాలు పెట్టాలి. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది.– వైఎస్ షర్మిల, ఏపీసీసీ అధ్యక్షురాలు శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటన: అదే విధంగా నిన్న శ్రీకాకుళం జిల్లాలో షర్మిల పర్యటించారు. ఆముదాలవలస నియోజకవర్గంలోని కొర్లకోట గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ బానిసగా మారారని అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసే నివాళులు అర్పించారు. అనంతరం ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జెడీ శీలం, కిల్లి కృపారాణి, శ్రీకాకుళం జిల్లా సీపీసీ అధ్యక్షులు సనపల అన్నాజీరావుతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే సింగిల్ అజెండా

-మొదటిపేజీ తరువాయి





ప్రభుత్వ ఏకైక లక్ష్యం కావాలని అన్నారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటు చేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయన్న మంత్రి ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్?పై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. ఒప్పందాలతో పాటు పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించాము. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలి. ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తాము.– నారా లోకేశ్, మంత్రి



## ఆ లెజెండరీ బయోపిక్‌లో సాయి పల్లవి

సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటీమణుల్లో సాయి పల్లవి ఒకరు. ఇప్పటివరకు ఆమె ఎన్నో సినిమాల్లో నటించినప్పటికీ ఎప్పుడూ గ్లామర్ షో వైపు వెళ్లలేదు. ఎంతమంది కొత్త హీరోయిన్లు వచ్చి పోటీ పెరిగినా కూడా ఆమె తనదైన మార్గంలోనే ముందుకు సాగుతోంది. అందుకే ఆమె వ్యక్తిత్వానికి కూడా ఎంతోమంది అభిమానులు ఫిదా అవుతున్నారు. సాయి పల్లవి ఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో సినిమాలు చేసింది. ప్రస్తుతం ఆమె ఎక్కువగా బాలీవుడ్ సినిమాలపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నటి నటిస్తున్న ఏక్ దిన్ అనే బాలీవుడ్ చిత్రం ఈ ఏడాది మే 1న విడుదల కానుంది. అలాగే రామాయణ అనే భారీ హిందీ చిత్రంలో కూడా ఆమె నటిస్తోంది. ఇందులో ఈ నటి సీత పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే రెండు పెద్ద హిందీ ప్రాజెక్టుల్లో నటిస్తున్న ఆమెకు మరో ప్రముఖ దర్శకుడి సినిమాలో అవకాశం దక్కినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ టాప్ దర్శకుల్లో ఒకరైన సంజయ్ లీలా బాన్సాలీ లెజెండరీ నటి మధుబాల జీవిత కథ ఆధారంగా బయోపిక్ రూపొందించనున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. మొదట ఈ చిత్రంలో కియారా అద్వానీ , అనీత్ పడ్డ వంటి నటీమణులు ప్రధాన పాత్రల్లో కనిపించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి.



## సెట్‌లోనే ఉస్తాద్ భగత్ సింగ్ భామ శ్రీలీల ప్రిపరేషన్!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటుంది శ్రీలీల. రాశీ ఖన్నా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని స్క్రిప్ట్ వినకుండానే ఒప్పుకుందని ఇప్పటికే హరీష్ శంకర్‌తోపాటు రాశీఖన్నా కూడా పలు సందర్భాల్లో చెప్పిందని తెలిసిందే. ఇలాంటి విషయాన్నే ఒకటి శ్రీలీల షేర్ చేసుకుంది. అయితే ఇది కథ గురించి మాత్రం కాదు. తన షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పింది శ్రీలీల. హరీష్ శంకర్ తాను ప్రిపేర్ కావడానికి ఎప్పుడూ తనకు షూటింగ్‌కు ముందు కానీ లేదా షూటింగ్ కంటే ముందు రోజు కానీ ఏ స్క్రిప్ట్ లేదా మెటీరియల్‌ను ఇవ్వలేదని చెప్పింది. నేను సెట్‌లోనే షూట్ కోసం ప్రిపేర్ అయ్యాయని చెప్పింది. మొత్తానికి లొకేషన్‌లోనే షూట్ ప్రిపేర్ అయి ఎంత ప్రొఫెషనల్ కమిట్ మెంట్ ఉందో చెప్పకనే చెబుతోంది శ్రీలీల. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో పార్థీబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన సాంగ్స్ నెట్టింట దుమ్ములేపుతున్నాయి.



## పెళ్లి పీటలెక్కనున్న జేజమ్మ..

అరుంధతి మూవీతో జేజమ్మగా ప్రేక్షకుల గుండెల్లో స్థానం దక్కించుకున్న బ్యూటీ అనుష్క శెట్టి. ఆ తర్వాత బాహుబలి మూవీతో పాన్ ఇండియాలో క్రేజ్ దక్కించుకుంది. ప్రభాస్ సరసన నటించిన ముద్దుగుమ్మ.. తనదైన నటనతో ఆకట్టుకుంది. ?అయితే అప్పుడప్పుడు వీరిద్దరిపై పెళ్లి రూమర్స్ కూడా వినిపిస్తూనే ఉన్నాయి. ఏదో ఒక సందర్భంలో అనుష్కతో ప్రభాస్ పెళ్లి అంటూ బోలెడు కథనాలొచ్చాయి. కానీ అవన్నీ రూమర్స్‌గానే మిగిలిపోయాయి. తాజాగా ఈ స్వీటీ అనుష్క పెళ్లికి సంబంధించిన ఓ న్యూస్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ ముద్దుగుమ్మ ఓ బిజినెస్‌మెన్‌ను పెళ్లాడనుందని సమాచారం. ప్రస్తుతం నాలుగు పదుల వయసులో ఉన్న అనుష్క బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్తతో ఏడడుగులు వేయనుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఇది పెద్దలు కుదిర్చిన పెళ్లి అని.. ప్రస్తుతం పెళ్లికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. అబ్బాయి కన్నడ కుటుంబానికి చెందినవారని.. వీరిద్దరి వివాహ నిశ్చయానికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించినట్లు లేటేస్ట్ టాక్. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. రాబోయే రోజుల్లో అనుష్క పెళ్లిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే ఈ ఏడాది చివర్లో అనుష్క పెళ్లి పీటలెక్కే ఛాన్స్ ఉంది. ఇక సినిమాల విషయానికి వస్తే గతేడాది ఘాటీ మూవీతో అభిమానులను మెప్పించారు. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ప్రస్తుతం మలయాళంలో కథనార్ అనే భారీ బడ్జెట్ సినిమాలో అనుష్క నటిస్తున్నారు.

## బ్రేకప్‌పై రీతూ చౌదరి సంచలన పోస్ట్



బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ రీతూ చౌదరి తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను తలచుకుంటూ సోషల్ మీడియా వేదికగా ఎంతో ఎమోషనల్ అయ్యారు.గతంలో వ్యాపారవేత్త శ్రీకాంత్‌తో ప్రేమాయణం, పెళ్లి ప్రకటన చేసిన రీతూ, ఆ తర్వాత ఊహించని విధంగా విడిపోవాల్సి వచ్చింది. అయితే ఈ బ్రేకప్ వెనుక ఉన్న అసలు కారణాలను, ఆ సమయంలో తను అనుభవించిన నరకాన్ని వివరిస్తూ ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తను ఎంతో నిజాయితీగా ప్రేమించానని, ఆ బంధం కోసం పరితపించానని రీతూ ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాను, కేర్ తీసుకున్నాను. కానీ చివరకు మిగిలింది అవమానం, మోసం మాత్రమే. ఆ బంధం కోసం నేను అడుక్కున్నాను, డిప్రెషన్‌లోకి వెళ్ళాను. కానీ ఆ అబ్బాయి మాత్రం చాలా ఈజీగా మూవ్ ఆన్ అయిపోయాడు. పైగా ఒకప్పుడు ఫ్రెండ్ అని పిలిచిన అమ్మాయితోనే వెళ్ళిపోయాడు" అంటూ తన గుండె కోతను బయటపెట్టారు. స్నేహం కూడా ఆయుధంగా మారి తనను దెబ్బతీసిందని ఆమె వాపోయారు. ఈ సమాజం అమ్మాయిలను ఎంత ఈజీగా జడ్జ్ చేస్తుందో చెబుతూ రీతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక అమ్మాయి డబ్బు కోసం, చీప్ అటెన్షన్ కోసం తనపై లేనిపోని ఆరోపణలు చేసి సమాజం ముందు బ్యాడ్ చేసిందని, అయినా తాను మౌనంగానే ఉన్నానని తెలిపారు. "నేను సైలెంట్‌గా ఉన్నానంటే అది నా బలహీనత కాదు. ఫైట్ చేసే ఓపిక లేనప్పుడు నిశ్శబ్దమే బలం అవుతుంది. నిజం తెలియకుండా అందరూ రూమర్స్, ఆరోపణలు నమ్ముతారు కానీ నా బాధని ఎవరూ చూడరు" అని ఎమోషనల్ అయ్యారు.

## త్వరలోనే విజయ్, త్రిషల పెళ్లి



టీవీకే పార్టీని స్థాపించి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న విజయ్‌కి ఆయన సతీమణి సంగీత భారీ షాకిచ్చిన సంగతి తెలిసిందే. విజయ్‌తో విడాకులు ఇప్పించాలంటూ ఆమె కోర్టు మెట్లు ఎక్కడం.. ఒక నటితో ఆయన సహజీవనం చేస్తున్నాడని ఆరోపించడంతో త్రిష పేరు బయటకు వచ్చింది. విజయ్ సహజీవనం చేస్తున్నది త్రిషతోనే అని తమిళ మీడియా కోడై కూసింది. అది నిజమే అన్నట్లుగా త్రిష, విజయ్ కలిసి ఓ వివాహ వేడుకకు హాజరై, తమ బందాన్ని బహిరంగం చేశారు. అప్పటి నుంచి విజయ్, త్రిషల పెళ్లిపై నెట్టింట పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తవ్వగానే పెళ్లి చేసుకుంటారనే వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ఇదంతా పుకార్లే అని అంతా భావిస్తున్న తరుణంలో త్రిష తల్లి చేసిన ఓ పని.. మరోసారి వీరిద్దరి పెళ్లిపై చర్చకు దారి తీసింది. త్రిష,విజయ్ కలిసి ఓ వివాహ వేడుకకు హాజరైనప్పటి నుంచి వీరిద్దరి పెళ్లిపై నెట్టింట రకరకాల వార్తలు పుట్టుకొచ్చాయి. కొంతమంది అయితే ఏఐని ఉపయోగించి పెళ్లి వీడియో క్రియేట్ చేసి..సోషల్ మీడియాలో వదిలారు. ఆ వీడియోలు బాగా వైరల్ అయ్యాయి. అలా విజయ్ అభిమాని ఒకరు ఏఐ టెక్నాలజీతో విజయ్, త్రిషల పెళ్లికి సినీ, రాజకీయ ప్రముఖులంతా హాజరైనట్లు వీడియో క్రియేట్ చేశాడు. అది నెట్టింట తెగ వైరల్ అయింది. ఆ వీడియోకి త్రిష తల్లి ఉమా కృష్ణన్ లైక్ కొట్టారు. దీంతో విజయ్‌తో పెళ్లికి త్రిష తల్లి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటూ..ఆమె లైక్ కొట్టిన పోస్ట్‌ని వైరల్ చేస్తున్నారు. విజయ్ ప్రస్తుతం తన ఫోకస్ అంతా తమిళనాడు ఎన్నికలపైనే పెట్టాడు. పొత్తుకు బీజేపీ ఆసక్తి చూపుతున్నా.. ఈ సారి ఒంటరిగానే బరిలోకి దిగాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత త్రిషను అధికారికంగా పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నాడట. ఇప్పటికే ఈ విషయంపై ఇరు కుటుంబాలలో చర్చలు కూడా జరిగాయట. ఇక సంగీత విషయానికొస్తే.. ఓ అభిమానిగా పరిచయం అయితే ఈమెను.. విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 1999లో వీరిద్ద వివాహం జరిగింది. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. అయితే గత కొంతకాలంగా విజయ్, సంగీత వేరు వేరుగా ఉంటున్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881